# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన నాయకులు


చెన్నూర్: నివాళులర్పిస్తున్న అంబేద్కర్ వాదులు

**చెన్నూర్:** పట్టణంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికంగా అంబేద్కర్ విగ్రహానికి ఉపాధ్యాయులు, అంబేద్కర్ వాదులు, దళిత సంఘాల నాయకులు పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ వాదులు మాట్లాడుతూ.. 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు తగరం వెంకటి, ప్రధాన కార్యదర్శి మేకల రామస్వామి, చెన్నూరి రాజేశ్, తగరం సంపత్, మాజీ సర్పంచ్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** పట్టణంలోని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఆ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు దాసరి సుదర్శన్ హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపతి, కనకయ్య, బాపు, శంకర్, శ్రీనివాస్, వెంకటయ్య, రాయలింగు, పురుషోత్తం ఉన్నారు.

**నస్పూర్:** మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీసీసీలోని సుందరయ్య కాలనీ నుంచి సీసీసీ కార్నర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోషిక మల్లేశ్, ఉపాధ్యక్షుడు జువ్వాడి నందయ్య, నాయకులు తలారి రాజు, శ్రీనివాస్, తలారి పున్నయ్య, బత్తుల వెంకటస్వామి, దేవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి:** స్థానిక ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, రాజ్యాంగ రచన కమిటీ సభ్యుల చిత్రపటాలకు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నవంబర్ 26 న్యాయ వాదుల దినోత్సవం కావడంతో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు పలువురు న్యాయవాదులకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సీఓఈ వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు రవీందర్, కౌసర్, శోభ, విజయ్, న్యాయవాదులు సునీల్ కుమార్, రవికుమార్, ఉమారాణి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ పరిమళ, పీడీ బాబురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నెన్నెల:** మండలంలోని కోణంపేటలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ సంఘం మహిళా నాయకురాలు రమాదేవి, బెల్లంపల్లి రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌తో కలిసి పంచశీల జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు కొడిపె శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోడె రాజు, సంతోష్, యువకులు పాల్గొన్నారు.


నెన్నెల: పంచశీల జెండా ఎగురవేస్తున్న రమాదేవి


శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్, న్యాయవాదులు


నస్పూర్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

# సింగరేణి కార్మికులకు అండగా ఉంటా

- మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేం సాగర్‌రావు


కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ కౌన్సిలర్ కారుకూరి చంద్రమౌళి, అనుచరులు

**శ్రీరాంపూర్/నస్పూర్/మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్):** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని, ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేం సాగర్ రావు అన్నారు. నస్పూర్, శ్రీరాంపూర్, మంచిర్యాల, హాజీపూర్ మండలాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి హెచ్ఎంఎస్ యూనియన్ ఆయనకు మద్దతు తెలిపారు. ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు ఏ ఆప ద వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలను తీరుస్తామన్నారు. ప్రేం సా గర్‌రావుకు మద్దతుగా శ్రీరాంపూర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ ఆధ్వర్యంలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, దీనిని నిరసిస్తూ మంచిర్యాలలో కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు మద్దతు తెలుపుతున్నట్లు విద్యార్థి జేఏసీ నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని 25, 26, 27వార్డులకు సంబంధించిన సమావేశాన్ని బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీలను ప్రజలకు వివరించారు. కార్మికవర్గమంతా ఐకమత్యంతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి బి.జనక్‌ప్రసాద్ అన్నారు. ఐఎన్టీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 50మంది కాంగ్రెస్‌లో, ఐఎన్టీయూసీలో చే రారు. మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు కారుకూరి చంద్రమౌళి తన అనుచరులతో ప్రేం సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పెద్ద సంఖ్యలో వివిధ వార్డులకు చెందిన వారు, హాజీపూర్ మండలం టీకానపల్లికి చెందిన వారు సైతం కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వేర్వేరు కార్యక్రమాల్లో హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు తిప్పారపు సారయ్య, ఆ యూనియన్ నాయకులు, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జోగుల మల్లయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బాజీ సైదా, జిల్లా సమితి సభ్యులు, విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.


విజయ సంకేతం చూపిస్తున్న ప్రేం సాగర్‌రావు

# గుర్తుంచుకుని కారుకు ఓటు వేయాలి

- మంచిర్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు


దండేపల్లి: మాట్లాడుతున్న దివాకర్‌రావు


లక్సెట్టిపేట: సమావేశానికి హాజరైన ప్రజలు

**మంచిర్యాలటౌన్:** ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అన్ని పార్టీల అభ్యర్థులు వారి ప్రచారాన్ని వేగవంతం చేశారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని కోరుతూనే, అక్కడక్కడా ఓటర్లతో చమత్కరిస్తూ ఓటు అడుగుతున్నారు. జిల్లా కేంద్రంలోని గొల్లవాడకు చెందిన యువతతో మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు ఓటు వేయాలని, ఈ నెల 30వ తేదీని బాగా గుర్తుంచుకో... కారు గుర్తును మరీ మరీ గుర్తుంచుకో... కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 10, 11 వార్డుల్లోనూ ఎన్నికల ప్రచారాన్ని చేసి, తనను గెలిపించాలని కోరారు.

**'పెన్షన్‌దారులకు మరింత ఆసరా'**

**దండేపల్లి:** బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే పెన్షన్ దారులకు మరింత ఆసరా పెరుగుతుందని నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా దండేపల్లిలో ఆదివారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో దివాకర్‌రావు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపసర్పంచ్ భూమన్న, పట్టణ అధ్యక్షుడు సత్యం, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

**'నీతి, నిజాయితీతో పనిచేశా'**

**లక్సెట్టిపేట:** నీతి నిజాయితీతో నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం పని చేశానని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిత్యం ప్రజల కోసం అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేశానని, రాబోవు ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు.

**'మామను గెలిపించాలని ప్రచారం'**

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నడిపెల్లి దివాకర్‌రావు గెలుపు కోసం ఆయన కోడలు ఉదయశ్రీ జిల్లా కేంద్రంలోని 32వ వార్డు రాంనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి తన మామను భారీ మెజార్టీతో గెలిపించాలని, వార్డు కౌన్సిలర్ గాదె సత్యంతో కలిసి కోరారు.

# ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీలో ఒక్కడిగా పని చేస్తా

- చెన్నూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్

**జైపూర్:** పేదింటి కష్టాలు తెలిసిన వ్యక్తిగా, నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ కుటుంబ సభ్యుల్లో ఒక్కడిగా పేదప్రజలకు సేవ చేస్తానని చెన్నూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ తెలిపారు. మండలంలోని నర్వ, రసూల్‌పల్లి, ముదిగుంటతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.

**'అధికారంలోకి వస్తే బొగ్గు గనులు ఏర్పాటు'**

**మందమర్రిరూరల్:** తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే నూతన భూగర్భ బొగ్గు గనుల ఏర్పాటుకు కృషి చేస్తామని బీజేపీ అనుబంధ కార్మిక సంఘం బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. మందమర్రిలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని దోపిడీ చేస్తుందని మండిపడ్డారు. బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు వెంకట రమణ, రమేష్, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న దుర్గం అశోక్

**'పాపను ఆడిస్తూ.. ఓటు అభ్యర్థిస్తూ'**

**జైపూర్:** ప్రచారంలో భాగంగా జైపూర్ మండలంలో పర్యటించిన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ రసూల్‌పల్లిలో చిన్నపాపను ఎత్తుకుని వారి కుటుంబాన్ని కమలం పువ్వు గుర్తు ఓటు వేయాలని అభ్యర్థించారు. డిసెంబర్ 3న ఎమ్మెల్యేగా గెలిచి మళ్లీ వస్తానంటూ ప్రచారం చేశారు.



## కనుల పండువగా జ్వాలాతోరణం



**మంచిర్యాలఅర్బన్:** స్థానిక విశ్వనాథ స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి జ్వాలాతోరణం కనులపండువగా సాగింది. ఎండు గడ్డితో చేసిన తోరణంను నెయ్యి పోసి జ్వాలాగా వెలిగించారు. ఆ జ్వాలా క్రింది నుంచి శివ, పార్వతుల పల్లకిని మూడుసార్లు తీసుకెళ్లారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఈవో ముక్తారవి, అర్చకులు నరహరి, భట్టాచార్యులు, బాలక్రిష్ణ, ఆలయ ఉద్యోగులు గోపాల్‌రావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఆలోచన చేయండి..ఆగం కావొద్దు'

**జైపూర్:** కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ అభివృద్ధిలో దేశంలోనే నెంబర్-1 రాష్ట్రంగా నిలుస్తోందని అభివృద్ధిపై ఆలోచన చేయాలని ఎన్నికల్లో ఆగం కావొద్దని, మళ్లీ కాంగ్రెస్ పార్టీకో లేక బీజేపీ పార్టీకో ఓటు వేస్తే మళ్లీ తెలంగాణ వెనుకబడుతుందని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ తెలిపారు. మండలంలోని రామారావుపేట, ఇందారం, నర్సింగాపూర్, కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శివ్వారంలో ఎన్నికల ప్ర చారాన్ని స్థానిక ప్రజలు, రైతులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బోడజనార్దన్, నాయకులు శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.


రామారావుపేటలో మాట్లాడుతున్న బాల్క సుమన్

# ప్రజాసంఘాల జన చైతన్య యాత్ర

**మంచిర్యాలటౌన్:** ఓటు విలువ తెలుసుకో... మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకో అంటూ చేపట్టిన ప్రజా సంఘాల జనచైతన్య యాత్ర ఆదివారం మంచిర్యాలకు చేరింది. ఈ సందర్భంగా చెన్నూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యాత్ర కన్వీనర్, ఈబీసీ జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు మూడు ఒక్కటేనని, తెలంగాణ ప్రజలను మరోసారి వంచనకు గురిచేసేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. సెక్యులర్ పార్టీ అయినా కాంగ్రెస్‌కు ముస్లింలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యూసుఫ్, రైతు సేవా సమితి రాష్ట్ర నాయకుడు చిలకమర్రి రాంరెడ్డి, బీసీ సేవా సమితి రాష్ట్ర నాయకులు బొమ్మపాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న ఉద్యోగులు

**చెన్నూర్:** నియోజకవర్గంలో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభమైందని ఆర్వో దత్తు తెలిపారు. నియోజకవర్గంలో 1468మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో నియోజకవర్గంలో 500మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. ఈ అవకాశం 28 వరకు ఉందన్నారు. ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న డీటీ

## క్లుప్తంగా

### నేడు అమిత్‌షా రోడ్‌షో

**మంచిర్యాలటౌన్:** ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాలలో సోమవారం మధ్యాహ్నం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రోడ్‌షో నిర్వహించనున్నట్లు మంచిర్యాల బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమిత్‌షా రోడ్‌షో శ్రీనివాస థియేటర్ నుంచి అర్చన టెక్స్ చౌరస్తా వరకు ఉంటుందని తెలిపారు. సమావేశంలో మహారాష్ట్ర ఎమ్మెల్యే అశోక్, జిల్లా ఇంచార్జి మహేశ్, నియోజకవర్గ ఇంచార్జి వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు పాల్గొన్నారు.

### విజయవంతం చేయండి

**కోటపల్లి:** కార్తీకపౌర్ణమి సందర్భంగా ఈ నెల 27న జనగామ పోచమ్మ తల్లి అమ్మవారిని చెన్నూర్ గంగస్థానానికి తీసుకెళ్తున్నట్లు సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ ఎన్నికల దృష్ట్యా పోచమ్మ జాతరను వచ్చే నెల 1న రథోత్సవం , 2న బోనాల జాతర నిర్వహిస్తామని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు.

### క్షయవ్యాధిని గుర్తించి మందులు తీసుకోవాలి

**జన్నారం:** క్షయ (టీబీ) వ్యాధిని గుర్తించి సకాలంలో మందులు వాడితే వ్యాధిని నివారించవచ్చని ఎన్‌టీఈపీ ప్రోగ్రాం అధికారి ఫయాజ్‌ఖాన్ పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 51మంది టీబీ వ్యాధి అనుమానితులను ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తెమడ, ఎక్స్‌రే లాంటి నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఇందులో ముగ్గురికి వ్యాధి ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి క్షయవ్యాధి నివారణ మందుల కోర్సు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వైద్యాధికారి ఉమాశ్రీ, ఎల్‌టీ రాజేశ్వర్, ఎస్‌టీఎస్ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

### చర్చిలో సండే స్కూల్ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

**శ్రీరాంపూర్:** కృష్ణాకాలనీలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో ఆదివారం సండే స్కూల్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు బైబిల్ పాఠాలు, నృత్యాలు, ఇతర ఈవెంట్లు నిర్వహించారు. ఉత్సాహంగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్ ఎలిజిబెత్, స్వప్న సురేశ్, ఆగస్టీన్, కే వినయ్‌ప్రశాంత్, మొసెస్‌రాజు, నీలావతి తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**మంచిర్యాలటౌన్:** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రమోహన్ గౌడ్ ఉదారి ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. డిసెంబర్ 25వ తేదీన జిల్లా కేంద్రంలోని ఉషోదయ స్కూల్లో లయన్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తుండగా, 8 రీజియన్‌లకు సంబంధించిన సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

# నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలి


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

**బెల్లంపల్లిరూరల్:** అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బెల్లంపల్లిరూరల్ సీఐ రాజ్‌కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని బట్వాన్‌పల్లి, పెర్కపల్లి గ్రామాల్లో ఆదివారం కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్, కవాతు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సంఘ విద్రోహక చర్యలకు పాల్పడితే, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తాళ్లగురిజాల, టూ టౌన్ ఎస్సైలు నరేష్, రమేష్, ఏఎస్సైలు లింగన్న, రాజన్న, మజారుద్దిన్, కేంద్ర పోలీసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్:** ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని ఆర్కే4 గడ్డ ప్రాంతం నుంచి రాజీవ్‌చౌక్, భగత్‌సింగ్‌నగర్ మీదుగా సూపర్ బజార్ వరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలంతా సహకరించాలని సీఐ మహేందర్‌రెడ్డి కోరారు. పట్టణ ఎస్సై రాజశేఖర్, మందమర్రి ఎస్సైలు చంద్రకుమార్, హరిశేఖర్ పాల్గొన్నారు.

# 'అల్లర్లు సృష్టించే నైజం మాది కాదు'

**మంచిర్యాలటౌన్:** నియోజకవర్గంలో నాలుగుసార్లు తాను ఎమ్మెల్యేగా పనిచేశానని, కానీ ఇప్పటి వరకు ఎలాంటి అల్లర్లు సృష్టించలేదని, అలాంటి నైజం తమది కాదని, ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేం సాగర్‌రావు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు తాను నిస్వార్థంగా సేవ చేస్తున్నానని, తాను ఎంతో నిజాయతీగా ప్రజల మధ్య ఉంటున్నాని, తనకు అల్లర్లు సృష్టించాల్సిన అవసరం లేదన్నారు. ప్రేంసాగర్‌రావు ఆస్తుల వివరాలను తన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని, గతంలో ఆయనే స్వయంగా వందల కోట్లు ఉన్నట్లు ప్రకటించి, అఫిడవిట్‌లో కేవలం రూ.50కోట్ల మేర ఎలా చూపిస్తారని ప్రశ్నించారు. ప్రజలు మరోసారి తనను భారీ మెజారిటీతో గెలిపించడం ఖాయమని స్పష్టం చేశారు. తనకు అప్పులు చేసి ఎగ్గొట్టడం, భూకబ్జాలు చేయడం, టికెట్లు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడం వంటివి తెలియవని, అవన్నీ కాంగ్రెస్ అభ్యర్థికే సొంతమని ఆరోపించారు.


మాట్లాడుతున్న నడిపెల్లి దివాకర్‌రావు

# 'కమీషన్ల కోసమే ఓపెన్‌కాస్టు గనులు'

**జైపూర్:** తెలంగాణ వస్తే కొత్త ఉద్యోగాలు వస్తాయని, అసలు ఓపెన్‌కాస్టు గనులే ఉండవని కేసీఆర్ వారి దత్తపుత్రుల కోసం ఓపెన్‌కాస్టు గనులు ఏర్పాటు చేసి కమీషన్లు దండుకుంటున్నారని, సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య పెంచాల్సిన ప్రభుత్వం దాన్ని తగ్గించుకుంటూ వచ్చిందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వివేక్‌వెంకటస్వామి ఆరోపించారు. జైపూర్ మండల కేంద్రంతో పాటు దుబ్బపల్లి, పెగడపల్లి, ఏల్కంటి గ్రామాల్లో ఆదివారం రాత్రి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6-గ్యారంటీ పథకాలను వివరించారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వివేక్

## రాజీవ్‌నగర్ అభివృద్ధికి కృషి



**మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట:** ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని, రాజీవ్‌నగర్ రహదారి కష్టాలను తీర్చి, అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ మంచిర్యాల అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో, లక్సెట్టిపేటలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లక్సెట్టిపేటలో డప్పు చప్పుళ్లతో పాతబస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు.

## నేడు చెన్నూర్‌లో కేటీఆర్ రోడ్ షో

**చెన్నూర్:** పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో సోమవారం ఉదయం 10గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ రోడ్డు షో నిర్వహించనున్నట్లు చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. రోడ్డు షోకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా తులసి కల్యాణం

**మంచిర్యాలఅర్బన్:** లోక కల్యాణార్థమై స్థానిక షిరిడి సాయిబాబా సంస్థాన్ మందిరంలో ఆదివారం తులసిమాత, శ్రీ క్రిష్ణ భగవానుని కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.